



నాచారంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, నందమూరి రామకృష్ణ తదితరులు



ఆంధ్రజ్యోతి పరిశీలన

సీఎంఆర్‌పై.. నిఘా

- ఉమ్మడి జిల్లాలోని మిల్లుల్లో నెలనెలా అధికారుల తనిఖీలు
- యంత్రాంగం పర్యవేక్షణతో అక్రమార్కులకు అడ్డుకట్ట
- ఈ ఏడాది ఇప్పటి వరకు ధాన్యం గల్లంతు కేసులు నిల్
- ఇంకా పెండింగ్‌లోనే వానాకాలం ధాన్యం

గతేడాది రైస్‌మిల్లుల్లో కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎం ఆర్) విషయంలో జరిగిన అక్రమాల నేపథ్యంలో పౌరసరఫరాల శాఖతో పాటు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. నెలనెలా రైస్‌మిల్లుల, గోదాములను తనిఖీలు చేసి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తుండడంతో.. ఈ ఏడాది రైస్ మిల్లుల్లో సీఎంఆర్ అక్రమాలకు అడ్డుకట్ట పడింది. ఇప్పటి వరకు ధాన్యం వివరాలు గల్లంతైన కేసులు నమోదు కాలేదు. గతేడాది ఖమ్మం జిల్లాలో పలుచోట్ల సీఎంఆర్ ధాన్యాన్ని పలు రైస్ మిల్లుల యజమానులు స్వాహా చేయడం, అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ తనిఖీల్లో రావడంతో వాటిపై కేసులు కూడా నమోద య్యాయి. ఈ క్రమంలోనే 2024-25 యాసంగి, వానాకాలం సాగు విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. గత వానాకాలంలో సేకరించిన ధాన్యానికి సీఎంఆర్ బియ్యం గడువు తీరినా ఇంకా బియ్యం పూర్తిస్థాయిలో అందలేదు. గడువు పెంపునకు మిల్లర్లు విజ్ఞప్తి చేశారు.

ఖమ్మం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సీఎంఆర్ ధాన్యం కేటాయించిన రైస్‌మిల్లుల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు, మిలుల్లో ఉన్న ధాన్యం లాట్లను సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలని ప్రభుత్వం మొదట్లో భావించింది. అయితే సీసీ కెమెరాల ఏర్పాటు సాధ్యం కాలేదు. దీం తో అధికారులే రంగంలోకి దిగారు. ప్రతీ నెలా మిల్లుల్లో తనిఖీలు చే యడం, సీఎంఆర్ కేటాయింపులపైనా, ధాన్యం నిల్వలపైనా నివేదికలు ఇవ్వడంతో రైస్‌మిల్లుల్లో అక్రమాలు తగ్గుముఖం పట్టాయి. గతంలో వానాకాలం ధాన్యం కేటాయిస్తే ఏడాదికి, రెండేళ్ల వరకు ఆ ధాన్యం లెక్కలు చెప్పలేని పరిస్థితి. ప్రభుత్వ ధాన్యం అమ్ముకోవడం మిల్లర్లు ముందుగా సొమ్ము చేసుకుని ప్రభుత్వ సొమ్ముతో వ్యాపారం సాగిం చారు. దీంతో మిల్లుల యజమానులు ప్రభుత్వ సొమ్ము రూ.కోట్లతో భూములు, రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించారు. మళ్లీ కొత్త ధాన్య ం వచ్చినప్పుడు కొనడం, వాటిని సీఎంఆర్ బకాయిలకు అప్పగించడం ద్వారా రూ.వేల కోట్లు మిల్లులు యజమానులు రోటేషన్ చేసుకున్నారు. ఈక్రమంలో జిల్లాలో మూడు రైస్‌మిల్లుల్లో భారీగా ప్రభుత్వ సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సివిల్‌సప్లయీస్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతినెలా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు, కార్పొరేషన్ అధికారులు ఆకస్మికంగా మిల్లులు తనిఖీచేసి కిందిస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో యజమానుల కు అక్రమాలకు అవకాశం లేకుండా పోయింది. నెలవారీగా బియ్యం టార్గెట్లు విధించడంతో ప్రస్తుతం ఎప్పటికప్పుడు సీఎంఆర్ ధాన్యానికి బదులు బియ్యం పంపిస్తున్నారు. అయితే ఇంకా కొన్నిచోట్ల మిల్లుల యజమానులు జాప్యం సాగిస్తూనే ఉన్నారు.

ఖమ్మం జిల్లాలో..

2024-25లో వేసవిలో ఖమ్మం జిల్లాలో 1,60,888 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందుకు సంబంధించి 1,08,377 మెట్రిక్ టన్నుల బియ్యం రైస్‌మిల్లుల నుంచి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 65,585మె.ట. మాత్రమే పంపించారు. ఇంకా 60వేల మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం రావాల్సి ఉంది. అయితే వీరికి వచ్చే సెప్టెంబరు వరకు గడువు ఉంది. గడువులోపు మిగిలిన బియ్యాన్ని పంపించాల్సి ఉంది. 2024-25వానాకాలం కింద 2,95,609 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు పంపిణీచేశారు. 1,98,069మె.ట.బియ్యం సీఎంఆర్ కింద మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,67,690మె.టన్నులు అధికారులకు మిల్లర్లు అందించారు. ఇంకా 30,379మె.ట. బియ్యం పం పించాలి. మే 31కి గడువు తీరింది. ఇంకా సీఎంఆర్ బియ్యం పెండింగ్ లో ఉన్నాయి. గడువు పెంచాలని



రైస్‌మిల్లులో ధాన్యాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

(మిగతా 6వ పేజీలో)

సంక్షేమానికి ఆద్యుడు.. ఎన్టీ రామారావు

- ఆయన చూపిన బాటలోనే నేటి నేతలు
- తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడాయన
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నందమూరి రామకృష్ణ
- దమ్మపేట మండలం నాచారంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

అశ్వారావుపేట / దమ్మపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలో సంక్షేమ పథకాలకు ఆద్యుడు నందమూరి తారకరామారావు అని.. నాడు ఆ మహానుభావుడు చూపిన రాజకీయ బాటలోనే నేటి నేతలు ఇంకా నడుస్తూ తెలుగురాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ పేర్కొన్నారు. తెలుగువారి ఔన్నత్యాన్ని ప్రపంచం నలుదిశలా చాటిన యుగపురుషుడు ఆయనని, ఆయన ఆశయాలు, మదిలో నుంచి ఆవిర్భవించిన పార్టీలో నాడు ఉన్న నాయకులే నేడు ఏ పార్టీలో, ఏ స్థాయిలో ఉన్నా నీతి నిజాయితీ, క్రమశిక్షణతో ప్రజలకు సేవ చేస్తున్నార న్నారు. మంగళవారం దమ్మపేట మండలం నాచారం గ్రామంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో అభిమానులు ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నందమూరి రామకృష్ణ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి నాడు కేంద్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారని, ఆయన స్ఫూర్తితోనే.. ఆయన పెట్టిన పార్టీనే నేడు కూడా దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. టీడీపీలో ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయ ఓనమాలు దిద్దినవారంతా ఇప్పుడు రాజకీయాల్లో, పాలనలో కీలకంగా వ్యవహరిస్తూ

మిగతా 6వపేజీలో..

రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్యదర్శిగా రమాదేవి



భద్రాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిని రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వీపీ గౌతమ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ముగ్గురు రెవెన్యూ అధికారులకు పోస్టింగ్‌లను కేటాయించగా.. అందులో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టరుగా ఉన్న ఎల్.రమాదేవికి హౌసింగ్ బోర్డు కార్యదర్శిగా నియమిస్తూ జీవో నెం.377ను జారీ చేశారు. ఈ నెల రెండో తేదీన భద్రాచలం దేవస్థాన ఈవో రమాదేవికి బదిలీ కాగా.. ఆమెకు రవాణ శాఖకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ బోర్డు కార్యదర్శిగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హాజరును 'ఎఫ్ఆర్ఎస్'లో నమోదు చేయాలి

పాఠశాలలో బ్యాగ్ లెస్ డే నిర్వహించాలి

విద్యాశాఖ అధికారులతో సమీక్షలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులకు సెలవు మంజూరు సమయంలో పాఠాలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, చదివే విద్యార్థుల పూర్తి వివరాలు మూడు రోజుల్లో ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయులకు జారీ చేసిన డిప్యూటేషన్ పై సమీక్షించాలన్నారు. జిల్లాలో 1600 ప్రభుత్వ పాఠశాలల్లో 65వేలకు పైగా విద్యార్థులు చదువుతుంటే, వీటిలో 237పాఠశాలల్లో 56,300 మంది విద్యార్థులున్నారని, ఈ 237 పాఠశాలల్లో ఎక్కడా టీచర్ల కొరత లేకుండా చూడాలని, మంజూరైన పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కలెక్టర్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్ 77 శాతం ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ క్రింద పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది పని తీరు మెరుగు పరుచుకోవాలన్నారు. మూడు నెలల తర్వాత పని తీరుపై సమీక్షిస్తామని, ఆశించిన ఫలితాలు రాని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూడీఐఎస్ఈ పోర్టల్‌లో పాఠశాల వివరాలను 15రోజుల్లో అప్ డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగపద్మజ, తదితరులు పాల్గొన్నారు.

పులిగుండాల అభివృద్ధికి..

₹4.28కోట్లు



- పర్యాటకుల కోసం ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- పులిగుండాల టూ కిన్నెరసానికి ప్రత్యేక ప్యాకేజీ
- అటవీ శాఖ ఖమ్మం జిల్లా అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

7



ఈవో రమాదేవికి ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మంత్రి సురేఖ

భద్రాద్రి దేవస్థానానికి ఐఎస్‌వో సర్టిఫికెట్

పత్రాలను ఈవోకు అందజేసిన దేవాదాయశాఖ మంత్రి సురేఖ

భద్రాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం మరో అరుదైన ఘనతను సాధించింది. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రి దేవస్థానానికి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌వో) గుర్తింపు లభించడం విశేషం. ఐఎస్‌వో 9001:2015, 22000:2018 సర్టిఫికెట్లను దేవస్థానం ఈవో ఎల్ రమాదేవికి రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖ, ఐఎస్‌వో డైరెక్టర్ శివయ్య హైదరాబాద్‌లో మంగళవారం అందజేశారు. ఈ సర్టిఫికెట్లు ప్రసాదాల తయారీ, ఆహార భద్రత, నిర్వాహణ స్థాయి పాటించడంతో ఈ గుర్తింపు లభించింది. గతనెల 29న ఐఎస్‌వో బృందం దేవస్థానంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఐఎస్‌వో గుర్తింపు లభించడంతో దేవస్థానం అధికారులు, వైదిక పరిపాలన సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) గుర్తింపు ఉంది. అలాగే ఇటీవల దేవస్థానం స్వామి వారి చిత్రాలకు సంబంధించి కాపీరైట్ హక్కులను కూడా సాధించిన విషయం తెలిసిందే.

కొత్త కొత్తగా

- అమృత్ భారత్ పథకంలో కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ
- రూ. 24కోట్ల కేటాయింపు
- మూడేళ్లుగా సాగుతున్న పనులు
- స్టేషన్‌లో సరైన వసతుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు



కొత్తగూడెం రైల్వేస్టేషన్ బోర్డు, ప్లాట్ ఫామ్స్ ఇవే..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) త్వరలోనే కొత్త రూపును సంతరించుకోనుంది. అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగూడెం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రూ.24 కోట్ల నిధులను కేటాయించి నిర్మాణ మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టింది. 2023, నవంబర్ నెలలో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు రైల్వే బోర్డు నుంచి ఆదేశాలు వెలువడగా.. ప్రాంగణంలో ఉన్న రైల్వేస్టేషన్ రూపు రేఖలన్నీ మార్చేందుకు పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో అంతర్గత భవనాలను పూర్తిగా నేలమట్టం చేసి భారీ స్థాయిలో పనులను ప్రారంభించారు.

స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు

కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లోని వివిధ విభాగాలను ఆధునికీకరించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. స్టేషన్ ఆవరణలో స్లీపర్, అప్పర్ క్లాస్ వెయిటింగ్ హాల్, ఫేస్ లిఫ్టింగ్, రూఫ్ లీకేజెస్, అధికారుల ప్రత్యేక గదులు, పార్కింగ్, ఫుడ్ ప్లాజా, గార్డెనింగ్ ప్రధాన ముఖ ద్వారా పనులను చేపట్టారు. అయితే నిధుల లేమితో మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో.. రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తికాని నిర్మాణాలు.. ప్రయాణికులకు తప్పని తిప్పలు!

కొత్తగూడెం రైల్వేస్టేషన్ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కరోనా ముందు వరకు స్టేషన్ నుంచి ప్రతీరోజు నడిచిన కాకతీయ ప్యాసింజర్, సింగరేణి ప్యాసింజర్, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కొల్హాపూర్ సూపర్ ఫాస్ట్, మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సుమారు 23 గూడ్స్ రైలు నడిచేవి. ప్రస్తుతం ఈ రైళ్లు కాకతీయ, సింగరేణి ప్యాసింజర్లు, మణుగూరు ఎక్స్‌ప్రెస్‌లు మూడు రైళ్లకే పరిమితమైంది. రైల్వే ప్రయాణికులు రైల్వే స్టేషన్ ప్రాంగణానికి వస్తున్న సమయాల్లో ప్రాంగణంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరీ ముఖ్యంగా ఈ వర్షాకాలంలో ప్రయాణికులు పడుతున్న వెతలు వర్ణనాతీతం.

(మిగతా 6వ పేజీలో)



పాలేరు పరవళ్లు..

- 24.5 అడుగుకు చేరిన నీటిమట్టం
- 15వేలకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- గతేడాది కంటే ఒక నెల ముందే పారిన అలుగులు

7



'పోడు'కు పూర్తి హక్కులివ్వాలి

- వ్యవసాయ కూలీలకు రూ. 12వేల భృతి కల్పించాలి
- మహిళలకు రూ. 2,500 పథకం అమలు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ వినతి
- ఆర్టీసీ ఉద్యమాన్ని గుర్తు చేసిన ముఖ్యమంత్రి

6

నామినేషన్ పద్ధతిలోనే
ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను నామినేషన్ పద్ధతిలోనే ఎంపిక చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి రాష్ట్ర స్థాయి అవార్డుల ఎంపిక కోసం ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీఇన్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ఉషారాణిని మెంబర్ కన్వీనర్‌గా నియమించారు. జిల్లాలో జిల్లా కో- కన్వీనర్‌గా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంఈఓ, డిప్యూటీ ఈఓలు తమ పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారి పేర్లను ప్రతిపాదిస్తారు. కలెక్టర్ చైర్మన్‌గా గల కమిటీ జిల్లాకు ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తుంది. ఈ జాబితాలను 18 లోగా రాష్ట్ర అవార్డుల కోసం పంపిస్తారు. అవార్డుల కమిటీ ఈ నెల 19 నుంచి 28 వరకు స్క్రూటినీ చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు సిఫారసు చేస్తారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు నేరుగా డీఈవో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. విద్యాశాఖ అధికారి ఆధ్వర్యం లో ఉత్తమ ఉపాధ్యాయుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు పంపడం జరుగుతుంది. దానిని కలెక్టర్ ఆమోదంతో రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుంది. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధిరకారులే నామినేషన్లు పంపడం జరుగుతుంది.

యూరియా కోసం
అన్నదాతల ఆగ్రహం

- సొసైటీలో యూరియా లేకపోవడంతో రోడ్డెక్కే ప్రయత్నం చేసిన రైతులు
- ఆందోళనను విరమింపజేసిన అధికారులు
- రెండు రోజుల్లో 50 టన్నుల యూరియా వస్తుందని వెల్లడి


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ సూరజ్, ఏవో బాలాజీ

కొణిజర్ల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత రైతులను వేధిస్తుంది. సొసైటీ పరిధిలో యూరియాను ఎందుకు సరిపరా చేయడం లేదని ఆగ్రహించిన రైతులు రోడ్డుపై ఆందోళన చేసేందుకు సిద్ధం అయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు వారికి నచ్చచెప్పి యూరియా తెప్పిస్తామని హామీ ఇచ్చి రైతులను ఆందోళన నుంచి విరమింపచేసిన సంఘటన మంగళవారం మండలకేంద్రం కొణిజర్లలో జరిగింది. మండల పరిధిలోని సింగరాయపాలెం, సాలెబంజర, లాలాపురం తదితర గ్రామాల రైతులు ఉదయం కొణిజర్లలోని గోపవరం సొసైటీ వద్దకు వచ్చారు. యూరియా లేదని చెప్పడంతో రైతులు ఆగ్రహించారు. ప్రస్తుత సీజన్‌లో యూరియా అవసరం ఉందని, సరిపడా యూరియాను అందించకపోతే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రధానరహదారిపై ఆందోళన చేసేందుకు వెళ్లారు. వెంటనే విషయం తెలుసుకున్న ఎస్ఐ సూరజ్ అక్కడకు చేరుకున్నారు. రోడ్డుపై ఆందోళన చేయవద్దని, యూరియా గురించి అధికారులతో ప్రశాంతంగా మాట్లాడదామని రైతులకు చెప్పి ఏవో బాలాజీకి సమాచారం ఇచ్చి పిలిపించారు. రైతులు కూడా తమ ఆందోళన చేసే ప్రయత్నాన్ని విరమించారు. సొసైటీకి ఇప్పటి వరకు 300 టన్నుల యూరియా వచ్చిందని, ఇంకా అవసరం ఉం దని ఉన్నతాధికారులతో చెప్పడంతో పంపిస్తున్నారని ఏవో తెలిపారు. ప్రస్తుతం జిల్లా నుంచి 15 టన్నులు ఈరోజు సాయంత్రమే సొసైటీకి చేరుతుందని, మరో రెండు రోజుల్లో 35 టన్నులను వైజాగ్ నుంచి తెప్పిస్తున్నట్లు రైతులకు వివరించారు. రైతులు అర్థం చేసుకోవాలని ఏవో, ఎస్ఐ కోరారు. ఏవో బాలాజీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఈ జూలై వరకు కొణిజర్లలోని గోపవరం సొసైటీకి 100 టన్నులు అదనంగా యూరియా రావడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు సొసైటీకి 300 టన్నుల యూరియా వచ్చిందని, ప్రైవేటు షాపులన్నింటికీ కలిపి 750 టన్నులు వచ్చినట్లు తెలిపారు. కొణిజర్ల మండల రైతులతో పాటు వేరే మండలాల రైతులు కూడా తీసుకెళ్లుతున్నారని, ఇక్కడ రైతులు ఆ రైతులకు ఇచ్చే ప్రయత్నంను విరమించుకోవాలని కోరారు. వేరే మండలాల రైతులకు యూరియా వెళ్లిందని సమాచారం తెలిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఈ మండల రైతులకు సరపడా యూరియా అందుతుందన్నారు. రైతులు అధైర్యపడొద్దని, అర్థం చేసుకొని యూరియాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీకి 50 టన్నులు యూరియా వస్తుందని, దానిలో ప్రస్తుతం 15 టన్నులు జిల్లా నుంచి వస్తుండగా 35 టన్నులు వైజాక్ నుంచి తెప్పిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో సొసైటీకి చేరుతుందన్నారు.

28 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాడ్మింటన్ సంఘ సభ్యులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఈనెల 28 నుంచి 31 వరకు అండర్-15 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. మంగళవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వారు వెల్లడించారు. నగరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రటరీ వింజనంపాటి చంద్రశేఖర్, సీనియర్ ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ కమర్తపు మొరళి, ఉపాధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

జిల్లా స్థాయి టీటీ జట్ల ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): త్వరలో ఖమ్మంతో పాటు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నీస్ పోటీలలో పాల్గొనే జిల్లా టేబుల్ టెన్నీస్ జట్లను నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికలను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో క్రీడలు ఆడి విజయం సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి ప్రకటించారు.జట్టులో అనుమోలు శ్రాయన్, జాయ్, ఈశ్వర్, హేమంత్‌సాయి, నిహాల్ కృష్ణ, అన్నెం యశ్వంత్, రోషన్, బాలసాని హార్వికలక్ష్మి, పి. ఆరాధ్య, తోట జిజ్ఞాస, రోస్మిత, పర్స వంశిక, బాలసాని తన్మయ్‌శ్రీ, బొంతుసాయిశివాని, కోటగిరి హితేష్, ఈలప్రోలు హరి, అభిలాష్, అన్వేష్, సాయిహర్షిత్, హర్షిత, అఖిల, స్పందన, పావని, ఫజల్, చార్విక్, తరుణ్, ఉజ్వల్, స్థితప్రజ్ఞ, పరిటాల జ్వలిత్, పిట్టల మోహిత్‌కృష్ణ, రామ్‌సాకేత్, రణధీర్‌రెడ్డి, సైఫ్, అనస్, గద్దల సిరి, అమృత, చంద్రికరాణి, షర్మిళ, సుప్రియ, అఖిల, సౌమ్య, స్ఫూర్తి, రష్మి, జస్సి, ధనుష్, గుణసోమశేఖర్ ఎంపిక చేసినట్లు తెలిపారు.

నేడు స్వగ్రామానికి జవాన్ అనిల్ మృతదేహం

కారేపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ లోయలో ప్రమాదవశాస్తు పడిపోయి మృతి చెందిన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సూర్యతండాకు చెందిన జవాన్ బానోత్ అనిల్ మృతదేహం బుధవారం స్వగ్రామానికి వస్తుందని మంగళవారం కుటుంబసభ్యులకు ఆర్మీ అధికారులు సమాచారం అందించారు. ఈరాత్రికి హైదరాబాద్‌కు అనిల్ మృతదేహం వస్తుందని తెలిపారు. ఉదయం కారేపల్లి క్రాస్‌రోడ్డుకు చేరుకుంటుందని, అక్కడనుంచి ప్రదర్శనగా సూర్యతండాకు తీసుకువెళ్తారని తెలిపారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

కోతకు గురవుతున్న సాగర్ కాల్వ



కూసుమంచి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం అవుట్‌ఫాల్ గేట్ల వద్ద మినీహైడల్ ప్రాజెక్టు వైపు సాగర్‌కాల్వ స్వల్పంగా కోతకు గురవుతోంది. గత ఏడాది భారీవర్షాలకు గండిపడిన విషయం తెలిసిందే ఇటీవల పునర్నిర్మాణం చేశారు. అయితే ఇటీవల సా గర్ నీటిని విడుదల సుమారు నాలుగువేల క్యూసెక్కులకు పెంచారు. తిరిగి మంగళవారం నీటివిడుదల తగ్గించడంతో పోతమట్టి కోతకు గురైనట్లు కన్పిస్తోంది.

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తాం: ఎమ్మెల్యే కోరం


రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరం


కామేపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని 24గ్రామ పంచాయతీలలో రేషన్ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని ప్రజా ప్రభుత్వంలో అందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేశామని అన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, గబ్రూ, ఎంపీడీవో రవీందర్, డీఎస్, మద్దిన్ని రమేష్, సరిరాం, జర్పుల లక్ష్మణ్, గోపిరెడ్డి, బొడ్డు లక్ష్మీనారాయణ, రామనాథం ఉన్నారు.

విస్తృతంగా బీఎస్ఎన్ఎల్ సేవలు

- ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖరబాబు


బీఎస్ఎన్ఎల్ సిమ్‌లను అందిస్తున్న డీజీఎం

ఇల్లెందుటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృత పరుస్తున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) రాజశేఖరబాబు పేర్కొన్నారు. మంగళవారం ఇల్లెందులో ఒక్క రూపాయికి బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డును అందజేశారు. టెలికం కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాస్, రవి కుమార్, మనీష్ జైన్, భరత్ రెడ్డి ఉన్నారు.



'నా తెలంగాణ' పుస్తకంలో
గోపిశెట్టి కవితలు

పెనుబల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భవానీ సాహిత్యవేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో డాక్టర్ వైరాగ్య ప్రభాకర్ సంపాదకంలో 'నా తెలంగాణ' పుస్తక ప్రచురణలో పెనుబల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కవి, రచయిత గోపి వెంకటేశ్వరరావు కవితలను ప్రచురించారు. ఈ కవితల్లో విభిన్న విషయాలను తెలియజేస్తూ ఆచారాలు, సంప్రదాయాలు, సం స్కృతులు, ఆధ్యాత్మిక పోరాటాలు, స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం ప్రాణాలను గడ్డిపూచకంటే హీనంగా అర్పించిన తెలంగాణ పోరాట యోధుల చరిత్ర ను, చారిత్రాత్మక తెలంగాణ పుస్తకంలో గోపిశెట్టి కవితలను అందించారు. సమాజంలోని వివిధ అంశాలపై విశేషిస్తున్న గోపిశెట్టి వెంకటేశ్వరరావు నుంచి మరిన్ని కవితలు, విశ్లేషణలు అందాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- వరద నియంత్రణ చర్యలపై కలెక్టర్లతో సీఎం వీసీ


ఖమ్మం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాల పడతాయన్న సమాచారం నేపథ్యంలో 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలో ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. వరద నియంత్రణ చర్యలపై ఆయన మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, బృందాలను సిద్ధం చేయాలని, ఆకస్మిక వరదల సమయంలో ప్రజల ప్రాణాల రక్షణకు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు హెలికాప్టర్లు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. గత సంవత్సరం ఖమ్మంలో ఎదురైన ఇబ్బందులు మరొకసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. కార్పొరేషన్లలో డిజాస్టర్ మేనేజ్మెంట్ కోసం ప్రత్యేక అధికారులను నియమించి 24/7 మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వరదల నేపథ్యంలో కనెక్టివిటీ దెబ్బ తినకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన రోడ్లు పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు.

అనంతరం ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరులు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే వరదను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు నీటి పారుదల ప్రాజెక్టులు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు చెరువుల సమీపంలోని రోడ్లు, వంతెనలపై రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని, దీనికి సంబంధించి ఎంపీడీవోలు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో నరసింహారావు, లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, డీఎంహెచ్‌వో కళావతీ బాయి, డీఆర్వో. ఎ.పద్మశ్రీ, సీపీవో ఎ.శ్రీనివాస్, నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, కల్లూరు ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి, ఆర్అండ్‌బి. ఈఈ తానేశ్వర్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ పాల్గొన్నారు.

ముందస్తు సమాచారమిస్తూ రైతులను అప్రమత్తం చేయాలి

● దమ్మపేట నుంచి వీసీలో పాల్గొన్న మంత్రి తుమ్మల


భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు సమాచారమిస్తూ రైతులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మంగళవారం జరిగిన సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన దమ్మపేట నుంచి పాల్గొన్నారు. యూరియా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పంటల నష్టమేమీ ఉండదని యూరియాపై ఉన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రామగుండం నుంచి రోజుకు ఒక ర్యాక్ వస్తుందని డిమాండ్ ఉన్న జిల్లాలకు యూరియాను పంపిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. నాలుగు నెలల నుంచి యూరియా సమస్యపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా కేటాయించిన యూరియాను సక్రమంగా సర్దుబాటు చేయడం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ విషయాన్ని తుమ్మల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వరి వ్యవసాయం ముమ్మరంగా జరుగుతున్నందున యూరియా డిమాండ్ అధికంగా ఉంటుందని రాష్ట్రానికి అవసరమైన యూరియా ఇవ్వక పోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి తుమ్మల సీఎంకు వీడియోకాన్ఫరెన్స్‌లో వివరించారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిసి రాష్ట్రానికి రావాల్సిన యూరియాను త్వరగా రాష్ట్రానికి పంపాలని విజ్ఞప్తి చేసి ఒత్తిడి తెచ్చేలా చూడాలని సీఎంను మంత్రి తుమ్మల కోరారు.

కొత్తకొత్తగా..

(5వ పేజీ తరువాయి)

● అధిక లాభాలు ఆర్జించే భద్రాచలం రోడ్‌కు సౌకర్యాలు నిల్

సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోనే అత్యధిక లాభాలను అందించే కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గత రెండేళ్లుగా ప్రారంభమైన మరమ్మతు పనుల వల్ల ప్రయాణికులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. కనీసం రైలు వచ్చే వరకు ఎదురు చూసే వెయిటింగ్ హాల్, ఏసీ వెయిటింగ్ హాల్ లేకపోవడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి.. అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని రైల్వే ప్రయాణికులు, భద్రాద్రి జిల్లా వాసులు కోరుతున్నారు.


రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

పోడు సాగుదారులకు పూర్తి హక్కులు ఇవ్వాలి

- వ్యవసాయ కూలీలకు రూ.12వేలు భృతి కల్పించాలి
- మహిళలకు రూ.2,500 పథకం అమలు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ వినతి
- ఆర్టీసీ ఉద్యమాన్ని గుర్తు చేసిన ముఖ్యమంత్రి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పోడు సాగుదారులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో హక్కు పత్రాలు ఇచ్చారని, కానీ అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, పోడు సాగుదారులకు పూర్తి స్థాయిలో పట్టా హక్కులు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించింది. మంగళవారం హైదరాబాద్‌లో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు నేతృత్వంలో ముఖ్యమంత్రిని కలిసిన పలువురు నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సుమారు 27 సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. వ్యవసాయ కార్మికులకు రూ.12వేల భృతి, మహిళలకు రూ.2,500పథకం, రైతు భరోసా సకాలంలో ఇవ్వాలని, నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ పే రూ.18వేలు ఇవ్వాలని, ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన వారికి ఇవ్వాలన్నారు. నారాయణపేట్, కొడంగల్ భూ నిర్వాసితులకు రూ.28లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. విద్యాశాఖపై నెలవారీగా రివ్యూ చేపట్టాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరించి యువతను కాపాడాలన్నారు. అక్రమంగా నమోదు చేసిన ఉపా కేసులు రద్దు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. ఆసరా పింఛన్లు రూ.4వేలకు పెంచాలని, విద్యా వ్యవస్థలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకరావాలన్నారు. సీఎంను కలిసిన వారిలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ రాంచందర్, కె.రంగారెడ్డి, కె.రమ పాల్గొన్నారు.

నేతలతో సీఎం సరదా సంభాషణ

తనను కలిసిన మాస్‌లైన్ నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపు సరదాగా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఆర్టీసీ ఉద్యమాన్ని గుర్తుచేసిన రేవంత్.. నాడు చేయి వేలుకు అయిన గాయం ఇప్పుడెలా ఉందని పోటు రంగారావు చేయిపట్టుకుని పరిశీలించారు. జిల్లాకు మంత్రులు వస్తే విపక్షాలను అరెస్టులు చేసే వారని సీఎం రేవంత్‌రెడ్డి అనగా.. ఇప్పుడు కూడా అదే జరుగుతోందని పక్కనే ఉన్న గుమ్మడి నర్సయ్య చెప్పారు. దీంతో ఔనా తమ ప్రభుత్వంలో అలా జరగదని, అయినా మురుగు కాల్వలు బాగాలేకపోయినా కమ్యూనిస్టులు సీఎంను అడుగుతారా? అని రేవంత్‌రెడ్డి సరదాగా ప్రశ్నించారు. దీంతో ఎన్నికల సమయంలో మురుగు కాల్వల నుంచి అన్ని విషయాలకు హామీలు ఇచ్చారు కదా అని పోటు రంగారావు అనడంతో.. ఇలాంటివి అడుగుతారనే మా అధికారులు మిమ్మల్ని ముందస్తు అరెస్టులు చేస్తున్నారని సీఎం నవ్వుతూ పేర్కొన్నారు.

సీఎంఆర్‌పై నిఘా

(5వ పేజీ తరువాయి)

మిల్లర్లు ఇప్పటికే విన్నవించారు. గడువు పెంచితే మిల్లర్లు, సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లర్లకు అప్పగించనున్నారు. జిల్లాలో మొత్తం 70రైస్‌మిల్లుల నుంచి సీఎంఆర్ బియ్యం సేకరణ జరుగుతుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇలా..

ఈ జిల్లాలో 2023-24కు సంబంధించి 3,722 మె.ట. బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 38 రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం పంపి బియ్యం సేకరిస్తున్నారు. 2024-25వానాకాలం కింద 1,13,169మె.ట. ధాన్యం సేకరించగా, మిల్లర్లు 75,827మె.ట. బియ్యానికి 72,459మెట్రిక్ టన్నుల బియ్యం అందించారు. ఇంకా 3,367మెట్రిక్ టన్నుల బియ్యం అందించాలి. మే 31 తో గడువు ముగిసింది. మళ్లీ గడువు పెంచితేనే మిల్లర్లు బియ్యం పంపిణీచేయాల్సి ఉంది. అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. యాసంగి కింద 53,797మె.ట. ధాన్యం సేకరించగా, 36,249మె.ట. బియ్యం అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు 13,634మె.టన్నులు అందించారు. ఇంకా 22,614మె.ట. బియ్యం రావాలి. వచ్చే అక్టోబరు వరకు గడువు ఉంది. మళ్లీ వానాకాలం సాగు ఇరు జిల్లాల్లో మొదలవగా.. ఈలోపు సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లుపూర్తిగా అందించాలి. ఇందుకోసం సివిల్‌సప్లయిస్, కార్పొరేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. మొత్తంమీద గతంలో రూ.కోట్ల విలువైన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇస్తామని మిల్లు యజమానులు తీసుకుని ప్రభుత్వ సొమ్ముతో అడ్డదారిలో వ్యాపారం సాగించేవారు. ధాన్యం తీసుకున్న తర్వాత గడువు ముగిసినా ఏదో ఒక సాకు పేరుతో బియ్యం పంపకుండా బకాయి ఉంచడం, పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పుడు ప్రైవేటుగా ధాన్యం కొని బియ్యం పంపడం, తద్వారా రూ.వేల కోట్ల టర్నోవర్ నడిచేది. ఇప్పుడు నెలవారీగా నిఘా నడుస్తుండడంతో రైస్‌మిల్లుల యజమానులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

సంక్షేమానికి ఆద్యుడు.. ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)


తుమ్మలను సన్మానిస్తున్న తాటి, పక్కన చింతమనేని

ఇటు దేశానికి, అటు తెలుగు రాష్ట్రాలకు వన్నె తెస్తున్నారని అదీ ఎన్టీఆర్ ఘనతని అన్నారు. దేశంలో సంక్షేమానికి ఎన్టీ రామారావు ఆద్యుడని, కార్మిక కర్షక, పేద బడుగు మైనార్టీ బలహీన వర్గాలకు కూడు, గూడు, గుడ్డ ఏర్పాటు చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. సినీ వినీలాకాశంలో ధ్రువతారలా మెరిసిన ఆ మహాత్ముడి విగ్రహావిష్కరణలు ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా హాజరవుతానని ఆయన ప్రకటించారు. ఆనాడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయగలిగామంటే అది ఎన్టీఆర్ చలువేనన్నారు. తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన ఖ్యాతి వెరువలేనిదన్నారు.

ఎన్టీఆర్ బాటలోనే చంద్రబాబు : నందమూరి రామకృష్ణ

ప్రపంచం నలుమూలలా తెలుగుజాతి ఖ్యాతిని కీర్తింపజేసిన ఎన్టీఆర్ కడుపున పుట్టడం తన అదృష్టమని, ఆయన విగ్రహాన్ని తన చేతులమీదుగా ఆవిష్కరించడం ఎన్నో జన్మల పుణ్యమని నందమూరి రామకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ యుగపురుషుడని, ఆయన బాటలోనే చంద్రబాబు తెలుగువారి ఆత్మాభిమానం కోసం అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కొనసాగిస్తున్నారన్నారు. ఆయన ఖ్యాతి ప్రపంచ వ్యాప్తమని, ఆయనిచ్చిన స్ఫూర్తితోనే ఈ ప్రాంతంలో పామాయిల్ సాగును అభివృద్ధి చేసి రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చి నేడు అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, చంద్రబాబు కూడా ఇటు పార్టీ, అటు రాష్ట్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ కమిటీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఖ్యాతి తెలుగుజాతి ఉన్నంత కాలం బతికే ఉంటుందని, ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనాభివృద్ధికి, ఎన్టీఆర్, చంద్రబాబు, తుమ్మల తీసుకున్న చర్యలు ఎంతో దోహదపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కట్రం స్వామి, మండల టీడీపీ అధ్యక్షులు వలీపాషా, కనగాల సాంబశివరావు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు ఎల్లిన రాఘవరావు, ఉపాధ్యక్షుడు కట్ట ఎర్రప్ప, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, రాయల సూరిబాబు, గడ్డిపాటి సత్యం పాల్గొన్నారు.

నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

జీవిద్దాం రండి...!

అవయవదానంతో పునర్జన్మ

కావాల్సింది యువచైతన్యమే



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : 'మీరు చనిపోయినా మీ కళ్లు అందమైన అమ్మాయిల్ని చూడాలని కోరుకుంటున్నారా? అయితే నేత్రదానం చేద్దాం..!' అనేది ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒక ప్రకటన. సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయిన ఈ ప్రకటన యువతలో నేత్రదానంపై అవగాహన తీసుకొచ్చింది. ఈ ప్రకటన యువతను ఆలోచింప చేసిందనడంలో అతిశయోక్తి లేదు. మరి కేవలం కళ్లను దానం చేస్తే అందమైన లోకాన్ని చూడొచ్చు.. మరి చనిపోయినా మళ్లీ బతకడం ఎలా? దీనికి కూడా అవకాశం ఉంది. అదే అవయవదానం, వైద్య పరిభాషలో బ్రెయిన్‌డెడ్ అయిన, లేదంటే చనిపోయిన వ్యక్తుల అవయవాలను నిమిషాల వ్యవధిలో వేరొకరికి అమర్చడం ద్వారా ఇతరులకు పునర్జన్మ ప్రసాదించి.. తద్వారా చనిపోయినా జీవించి ఉండొచ్చు.

అవసరమైన వారికి అమర్చి..

ఖమ్మంలో అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగకపోయినా హైదరాబాద్ లాంటి నగరాల్లో వీటికి సంబంధించి కో ఆర్డినేటర్లు ఉంటారు. వీరు ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్ కేసుల సమాచారాన్ని స్వచ్ఛంద సంస్థలకు అందజేస్తారు. వారు వచ్చి మృతుడి కుటుంబీకులతో మాట్లాడి అవయవదానానికి ఒప్పిస్తారు. వారు అంగీకరిస్తే మృతుడి అవయవాలను అవసరమైన బాధితులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తారు. మూత్రపిండాలు, కళ్లు, కాలేయం, గుండె లాంటి అవయవాలు అవసరమైన రోగులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకుని తమకు ప్రాణం పోసే వారి కోసం ఎదురుచూస్తుంటారు.

బ్రెయిన్‌డెడ్ అయితే...!

ప్రమాదాలు జరిగినప్పుడు కొన ఊపిరితో ఉండగా ఆస్పత్రులకు తీసుకొస్తుంటారు. ఆ వ్యక్తిని బతికించేందుకు వైద్యులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తారు. కానీ ఒక్కోసారి పరిస్థితి చేయిదాటి క్షతగాత్రులు బ్రెయిన్‌డెడ్ అవుతుంటారు. (బ్రెయిన్‌డెడ్.. అంటే మెదడు పనిచేయడం ఆగిపోతుంది. అంటే ఆ వ్యక్తి చనిపోయినట్టేనని డాక్టర్ల నిర్ధారణ చేస్తారు) అలాంటప్పుడు వారి అవయవాలు 12 గంటల లోపు మరో వ్యక్తికి అమర్చాలి. అప్పటి వరకు వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తారు. ఖమ్మం జిల్లాలో ఓ నేత్ర, అవయవ, శరీరదానాల సంఘం ఆధ్వర్యంలో 14 మృతదేహాలను మెడికల్ కాలేజీ విద్యార్థుల అధ్యయనం కోసం దానం చేశారు. ఇంకా 16మంది తమ శరీరాన్ని దానం చేసేందుకు అంగీకారాన్ని తెలిపారు. ఇక సత్తుపల్లి నుంచి ఒకరు, భద్రాద్రి జిల్లా రామవరం నుంచి ఒకరు, ఖమ్మం నుంచి ఇద్దరు జీవనధార యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఇక జిల్లాలో ఇప్పటి వరకు వేలాది మంది నేత్రాలను దానం చేశారు.

వయసుతో సంబంధం లేదు

అవయవాలను దానం చేసేందుకు వయసుతో సంబంధం లేదు. ఎవరైనా ఎప్పుడైనా తమ అంగీకారాన్ని తెలుపుతూ పత్రాన్ని ఇవ్వొచ్చు. దీనికి సంబంధించిన నమోదు ప్రక్రియ చాలా సులభంగా ఉంటుంది. తాము అవయవదానం చేయాలనుకుంటున్నా మంటూ ఫౌండేషన్‌ను ఆశ్రయించి అంగీకారపత్రం ఇస్తే చాలు.. వారు పూర్తి చిరునామాతో సహా సమాచారాన్ని తీసుకుని డోనర్ కార్డును ఇస్తారు. అయితే కచ్చితంగా ప్రతీ ఒక్కరూ ఈ విషయాన్ని తమ కుటుంబీకులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది కుటుంబాలలో అవగాహన లేకపోవడం కారణంగా జిల్లాలో ఈ కార్యక్రమం ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఎవరైనా ముందుకు రావొచ్చు

డాక్టర్ కంభంపాటి నారాయణరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు



కిడ్నీ, కాలేయం లాంటి అవయవాలు సరైన సమయంలో దొరక్క ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందు కు వస్తున్నా.. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. ఓ మంచి పనిచేసేందుకు వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా అవయవదానం చేసేందుకు అంగీకారం తెలపొచ్చు. అవయ వదానానికి ప్రత్యేకంగా జీవన్‌ధార యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.

ఇంకా అవగాహన పెంచాలి

మాధవరపు నాగేశ్వరరావు, తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదానాల సంఘం నాయకుడు



జిల్లాలో యువతకు, ప్రజలకు అవయవదానంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది. ఎవరైనా శరీరాన్ని, అవయవాన్ని దానం చేస్తే ఆ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేయాల్సి ఉంది. అలా లేనిపక్షంలో ఆ వ్యక్తి కుటుంబీకులతో మరణం తర్వాత ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు.

గిరిజన మ్యూజియాన్ని సందర్శించిన ఎన్నారై వైద్యురాలు రమ్య



గిరిజన మ్యూజియంలో ఎన్నారై వైద్యురాలు రమ్య

భద్రాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని గిరిజన మ్యూజియంను అమెరికాలో స్థిరపడిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ రమ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసిన కళాఖండాలను పరిశీలించారు. అలాగే వ్యవసాయ పనిముట్లు, జీవన విధానానికి సంబంధించిన పరికరాలను ఆమె భర్త రామ్, కుమార్తె రూపతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ అమెరికాలో కోవెల కళానిధి పేరుతో కూచిపూడి సంస్థను స్థాపించి భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు భరత నాట్యంను అమెరికా ప్రజలకు శిక్షణ ఇచ్చి మన సంప్రదాయాన్ని అంతరించిపోకుండా కాపాడుతున్నామని తెలిపారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన మాకు గిరిజన మ్యూజియం గురించి తెలుసుకొని సందర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇన్‌చార్జ్ వీరాస్వామి, నిర్వాహకులు మాధవి, రుక్మిణి, జైపాల్‌రెడ్డి, సుధారాణి, సీతారామలక్ష్మి, కమల, కృష్ణవేణి, రమాదేవి, భారతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కామేపల్లి మండల నాయకుడి హత్యకు సుపారీ?

ఇద్దరిని హతమార్చేందుకు మహబూబాబాద్ వ్యక్తులతో ఒప్పందం

రూ.4 లక్షలకు బేరం.. రూ.లక్ష అడ్వాన్స్

సామాజిక మాధ్యమాల్లో ఓ ఆడియో వైరల్

కామేపల్లి, ఆగస్ట్ 12 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకుడితో పాటు మరో వ్యక్తిని హత్య చేసేందుకు ఓ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చారన్న సమాచారం కలకలం రేపుతోంది. దీనికి సంబంధించిన ఓ ఆడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత సామా మోహన్‌రెడ్డితో పాటు మరో వ్యక్తిని చంపేందుకు అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ గ్యాంగ్‌తో సుపారీ మాట్లాడుకున్నట్టు ఆ ఆడియోలో రికార్డయింది. ఆ ఇద్దరిని చంపేందుకు సదరు యువకుడు ఆ గ్యాంగ్‌తో రూ.4 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడని, అందులో ఓ లక్ష అడ్వాన్స్‌గా కూడా చెల్లించినట్టు సమాచారం. సామా మోహన్‌రెడ్డి ఒంటరిగా ఉన్నప్పుడు ఆ గ్యాంగ్ దాడిచేసి హత్య చేస్తారని ఆ యువకుడు చెప్పినట్టు ఆడియోలో ఉంది. ఈ వ్యవహారం ఎన్ని రోజులుగా జరుగుతుందో? ఆ ఆడియో ఎవరిది అనే దానిపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపడితే నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

మృతురాలిది ఖమ్మం జిల్లా

నార్సింగ్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ హాస్టల్ ఉంటున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హైదరాబాద్‌లోని నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన బి.సుష్మిత(18) ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయం సంవత్సరం చదువుతోంది. స్నేహితులతో కలిసి నార్సింగ్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 11వ తేదీ సాయంత్రం తన రూమ్‌మేట్ తలుపు తీసేందుకు ప్రయత్నించగా, సుష్మిత లోపలి నుంచి గడియపెట్టుకున్నట్టు గుర్తించి, విషయాన్ని హాస్టల్ వార్డెన్‌కు చెప్పగా.. వారు తలుపులను బలవంతంగా తెరిచిచూస్తే సుష్మిత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. వెంటనే వారి బంధువులకు సమాచారమిచ్చి ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఈఘటనపై నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20ఏళ్ల జైలు

ఒక్కొక్కరికి రూ.2 లక్షల జరిమానా

ఖమ్మంలీగల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన మహేష్ అలియాస్ నాయక్ మల్లేష్, జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గడ్డం బువన్‌కు ఈ కేసులో శిక్ష విధించారు. జల్సాలకు అలవాటుపడి వీరు అక్రమార్జన కోసం 2021 ఏప్రిల్ 28న మోతుగూడెం నుంచి కారులో రూ.30లక్షల విలువచేసే 200 కేజీల గంజాయి కొనుగోలు చేసి తీసుకోస్తున్నారు. ఈక్రమంలో ఖమ్మం సమీపంలోని వి.వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఉండటం గమనించి కారును వేగంగా నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా ఢీకొట్టారు. దీంతో ఆటో, కారు బోల్తాపడ్డాయి. ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం జరిగింది. అనంతరం పోలీసులు కారును పరిశీలించగా 200 కేజీల బరువున్న 100 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులో తీసుకున్నారు. హైదరాబాద్ దిండిగల్ ఇషాక్ గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి కె.ఉమాదేవి పైవిధంగా తీర్పు చెప్పారు.

పంటమార్పిడితో అధిక దిగుబడులు

నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించాలి

భద్రాద్రి జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు

గుండాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో పాటు ప్రతీ ఏట పంటమార్పిడి చేయడంతో అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా పంటమార్పిడి, అంతర్గత పంటలపై దృష్టి సారించాలని అన్నారు. అధిక మోతాదులో యూరియా వాడరాదని నానో లిక్విడ్ యూరియా అందుబాటులో ఉందన్నారు. నానో యూరియా, డీఏపీల వాడకంపై వ్యవసాయ శాఖ అధికారులు, ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గుండాల పీఏసీఎస్‌ను సందర్శించి యూరియా పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వెంకటరమణ, ఏఈవోలు లెనిన్, బాలరాజు, డీలర్లు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

అశ్వారావుపేట/కొత్తగూడెం లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కొత్తగూడెం జిల్లా కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. అశ్వారావుపేట మండలం, తిరుమలకుంటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు లింగాల చక్రధరరావును మండలంలోని వినాయకపురంకు చెందిన షేక్ నజీర్ అనే వ్యక్తి 2022 డిసెంబర్ 8న డబ్బుల కోసం హత్య చేసిన ఘటన జరిగిందని ఎస్ఐ యయాతి రాజు తెలిపారు. దీనిపై డిసెంబర్ 9న కేసు నమోదు అయ్యింది. విచారణ అనంతరం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసారు. విచారణ అనంతరం కొత్తగూడెం ప్రిన్స్‌పల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ నిందితుడు షేక్ నజీర్‌కు జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కూసుమంచి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం వరదకు కొట్టుకువచ్చింది. పోలీసులు ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు. వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కూసుమంచి ఎస్ఐ నాగరాజు కోరారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



నాగరాజు(ఫైల్)

పెనుబల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమవివాహానికి తల్లిదండ్రులు నిరాకరించారనే కారణంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దంతాలపల్లి నాగరాజు(25) ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకొనేందుకు తన తల్లిదండ్రులు నిరాకరించడంతో గ్రామంలోని ఊరుబయటకు వెళ్లి మద్యంలో పురుగులమందు తాగి స్నేహితులకు ఫోన్‌చేసి చెప్పాడు. స్నేహితులు అతడ్ని పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కల్లూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి లారీని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వర్గం పాపారావు లారీ డ్రైవర్ రాజమండ్రిలో గోదావరి వద్ద నుంచి టీఎస్04యుడీ8379 నంబర్ గల లారీలో అక్రమంగా ఇసుకను నింపుకుని తెలంగాణ రాష్ట్రంలో విక్రయించేందుకు సత్తుపల్లి వీయంబంజర్ మీదగా చంద్రుగొండ వైపు వెళ్తుండగా అన్నపరెడ్డిపల్లి పోలీసులు గుంపెన సమీపంలోని బ్రిడ్జి వద్ద పట్టుకుని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. డ్రైవర్‌తో పాటు లారీ యాజమానిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆవులు తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం



పట్టుబడిన వ్యాన్‌లోని ఆవులు

తల్లాడ, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవులు తరలిస్తున్న వ్యాన్‌ను మంగళవారం తల్లాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌డ్రైవర్‌తో సహా నలుగురిపై కేసు నమోదు చేశారు. తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్‌లో ఎస్ఐ బి.వెంకటేష్, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కల్లూరు నుంచి అతివేగంగా వెళుతున్న వ్యాన్‌ను పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. వ్యాన్‌లో హైదరాబాదుకు తరలిస్తున్న ఐదు ఆవులు, నాలుగు దూడలను గుర్తించారు. ఆ ఆవులను దేవరపు శివ, బత్తుల గోవిందు తరలిస్తున్నట్టు, హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి పాత్ర కూడా ఉన్నట్టు విచారణలో డ్రైవర్ తెలిపడంతో నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో లస్కర్ మృతి

తల్లాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూతన్‌కల్ గ్రామానికి చెందిన నీటిపారుదలశాఖ లస్కర్ కిన్నెర తిరుమలయ్య(53) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. తిరుమలయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా కాంట్రాక్టు ప్రాతిపదికన నీటిపారుదల శాఖలో లస్కర్‌గా తిరుమలయ్య పనిచేస్తున్నాడు. తిరుమలయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

వైద్యం కోసం వచ్చిన వ్యక్తి...

అశ్వాపురం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యచికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి మండల పరిధిలోని అమెర్దా కాలనీకి చెందిన బర్ల వెంకటేష్ (55) ఆయాసం వస్తుందంటూ అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే మృతిచెందాడు. గుండెపోటుతోనే వెంకటేష్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

పులిగుండాల అభివృద్ధికి రూ.4.28 కోట్లు

పర్యాటకుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు

ప్రత్యేక వెబ్‌సైట్‌తో టూరిజం మరింత ముందుకు

పులిగుండాల టూ కిన్నెరసానికి ప్యాకేజీ

అటవీశాఖ ఖమ్మం జిల్లా అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్



అటవీశాఖ అధికారులకు సూచనలిస్తున్న డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్



చంద్రాయపాలెంలో పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): రూ.4.28 కోట్లతో పెనుబల్లి మండలంలోని పులిగుండాల పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని, హరితనిధి కింద మొదటి విడతలో రూ.1.89 కోట్లతో పనులు పూర్తి చేస్తున్నట్లు అటవీశాఖ ఖమ్మం జిల్లా అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన సత్తుపల్లిలోని అటవీశాఖ కార్యాలయం, సిబ్బంది క్వార్టర్స్ చెక్‌పోస్ట్‌లను పరిశీలించిన అనంతరం చంద్రాయపాలెం బీట్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాచ్‌టవర్, పాఠశాల, కంటైనర్ ఆస్పత్రిని పరిశీలించి వనసంరక్షణ సమితి సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... పులిగుండాలను ఎకోటూరిజం చేసేందుకు ఇటీవలే ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశామని, బయట వాహనాలను పార్కింగ్ చేసుకుని.. ఆ తర్వాత పర్యాటక వాహనాల్లో ప్రదేశాలను చూసే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు.. ఇక్కడ ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారని, ప్రశాంతతను దెబ్బతీసే శబ్ద నివారణకు కూడా కృషిచేస్తున్నామన్నారు. రూ.1.89కోట్ల హరితనిధితో సఫారీ బండి, బ్యాటరీ వాహనాలు, పెడల్‌బోట్లు త్వరలోనే రానున్నాయని, క్యాంటీన్‌తో పాటు మరుగుదొడ్లు నిర్మిస్తామని, అండర్‌గ్రౌండ్‌లో విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. డీఆర్‌డీఏ సహకారంతో ఎస్‌హెచ్‌జీ, వీఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో భోజనం, మిల్లెట్స్ అందిస్తామని, ప్లేట్లు సైతం ఆకులతో తయారు చేయిస్తున్నామని, సోలార్ ప్లాంట్ ద్వారా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. రక్షణ కోసం ట్యాంక్‌చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని, సీసీ కెమెరా నిఘా ఉంటుందన్నారు. పులిగుండాల ప్రాజెక్టును త్వరలోనే పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. చుట్టుపక్కల 30కిలోమీటర్ల మేర సఫారీరూట్ వేయించగా ఇటీవలే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారన్నారు. వాచ్‌టవర్‌ల ద్వారా ప్రకృతిని మరింతగా ఆస్వాదించవచ్చునని, కాకతీయుల తరహాలో పగోడాలు, బెంచీలు, గేట్లు తయారు చేయించామన్నారు. త్వరలోనే kmm-foest.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లను ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ రెండు రోజులపాటు బస చేసేందుకు టెంట్ సౌకర్యంతో పాటు భోజన వసతి ఉంటుందన్నారు. కాటేజీల ఏర్పాటుకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ఇక్కడికి వచ్చి పరిశీలించారని, త్వరలోనే టెండర్ల ద్వారా పూర్తిచేస్తామని చెప్పారు. అటవీ ప్రాంతంలో కాలువలు, వాటర్‌ఫాల్స్‌ను చూసి తరించవచ్చని, వీరభద్రస్వామి టెంపుల్‌ను విస్తరించడంతో పాటు మరుగుదొడ్లు నిర్మిస్తామని చెప్పారు.

పులిగుండాల టు కిన్నెరసాని..

పులిగుండాలలో కొన్ని పాయింట్స్ ఓపెన్ చేశామని, ట్యాంక్‌తో పాటు బాంబూ హట్స్ ఏర్పాటు చేశామని, గుట్టపైకి 12 కిలోమీటర్లు వెళితే లెపర్డ్ వాచ్‌టవర్ పైనుంచి చూస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అటవీప్రాంతంతో పాటు దీంతో చుట్టూఉన్న ఏడు కొండలు కనిపిస్తాయన్నారు. భవిష్యత్‌లో ఖమ్మం జిల్లాలోని తాళ్లపెంట - బ్రహ్మళకుంట, భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు, చంద్రుగొండ ద్వారా ప్రవేశద్వారాలు ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల పర్యాటకులు వచ్చే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కిన్నెరసాని పార్క్ వద్ద కాటేజీలు నిర్మిస్తున్నారని, దీంతో పులిగుండాల నుంచి కిన్నెరసాని వెళ్లి అక్కడ నుంచి భద్రాచలం దర్శనానికి చేరేందుకు ప్యాకేజీ ప్లాన్ చేస్తున్నామన్నారు. వనసంరక్షణ సమితి సభ్యుల కోసం తెలంగాణ వన్ జీవన్‌ధార్ ప్రోగ్రామ్ కింద పాత భవనాలను మరమ్మతులు చేయడంతో పాటు అందుబాటులోకి తేనున్నామని తెలిపారు. వ్యాపారులను సైతం అనుమతిస్తామని, మార్కెటింగ్ దృష్ట్యా శిక్షణ కూడా ఇస్తామని చెప్పారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఫుడ్, వస్తువులను ఈ నెల 15వ తేదీన ఖమ్మంలో పంద్రాగస్టు వేడుకల్లో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, టాస్క్‌ఫోర్స్ రేంజర్ ఆర్.శ్రీనివాసరావు, సిబ్బంది నరసింహా తదితరులున్నారు.

పాలేరు పరవళ్లు..

24.5అడుగులకు చేరిన నీటిమట్టం

15వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో

గతేడాది కంటే ఒకనెల ముందే

పారిన అలుగులు



పాలేరు జలాశయంలో 24.5 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

కూసుమంచి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం పరవళ్లు తొక్కుతోంది. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పరీవాహక ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వరద నీరు పాలేరుకు చేరుతోంది. దీంతో 22 అడుగులున్న నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి 24.5అడుగులకు చేరుకుంది. దీంతో జలాశయం నిండుకుండలాగ మారి జలకళను సంతరించుకుంది. పాల నురుగువలె కనిపిస్తూ పర్యాటకులను కనువిందుచేస్తుంది. వర్షాల కారణంగా సాగర్ నుంచి 2702 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుంది. వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పాలేరు ఏటి నుంచి సుమారు 15,801 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. వచ్చిననీరు వచ్చినట్లే జలాశయంకు ఉన్న 24 ఫాలింగ్ గేట్ల ద్వారా బయటకు వదులుతున్నారు. కాగా గత ఏడాది సెప్టెంబరు 1వ తేదీన వరదలు రాగా, ఈ ఏడాది 20 రోజుల ముందుగానే పాలేరు అలుగులు పారుతోంది.

పర్యాటకులకు కనువిందు

పాలేరు జలాశయం అలుగులు పారుతుండటంతో పర్యాటకులను కనువిందు చేస్తుంది. అలుగులు పారుతున్న విషయాన్ని సోషల్‌మీడియాలో తెలుసుకుంటున్న పర్యాటకులు పాలేరు జలాశయం వద్దకు వచ్చి చూస్తూ సెల్ఫీ ఫొటోల్లో బంధిస్తున్నారు. కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పర్యాటకులను జలాశయం దగ్గరకు పోకుండా నిరోధిస్తున్నారు.

పరిశీలించిన అధికారుల బృందం

పాలేరు జలాశయాన్ని జిల్లా అధికారుల బృందం పరిశీలించింది. జలాశయానికి వచ్చే వరదను అడిగి తెలుసుకున్నారు. ఐబీ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈలు మధు, పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేష్, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, జిల్లా వ్యయసాయశాఖ అధికారి పుల్లయ్య, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు, ఏవో వాణి తదితరులు ఉన్నారు.

కొబ్బరిచెట్టుపై పిడుగు

కాలిన గృహోపకరణాలు



కరకగూడెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లిలో గొని సతీష్ ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్టుపై మంగళవారం పిడుగు పడింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. ఈ క్రమంలో కొబ్బరిచెట్టుపై ఒక్కసారిగా పిగుడు పడటంతో చెట్టుపై మంటలు చెలరేగాయి. అంతేకాక చెట్టు పక్కన ఉన్న వెలిశాల రాంమ్మూర్తి ఇంటిపై నిప్పు రవ్వలు పడటంతో ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, విద్యుత్ వైర్లు కాలిపోయాయి. తృటిలో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

ఆలయంలో చోరీ....

పాల్వంచ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండల పరిధి యానంబైలులోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీ ఘటనపై పాల్వంచరూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీ తాళాలను పగులగొట్టి సుమారు రూ.15వేలు అపహరించుకుపోయారు. గ్రామపెద్ద శిరసాని వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

70 గ్రాముల గంజాయి పట్టివేత

ఖమ్మం క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నగరంలోని ఇద్దరికి 70 గ్రాముల గంజాయిని విక్రయిస్తుండగా మంగళవారం ఖమ్మం త్రీటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకోని వారిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. నగరంలోని డాబాల బజారుకు చెందిన జగదీష్ అనే వ్యక్తి వేరే ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి ఖమ్మం డాబాల బజార్‌కు చెందిన దిలీప్ రాజా, దీపక్‌లకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పీఎస్ఆర్ ట్రస్టు తరుపున మృతుల కుటుంబాలకు మంగళవారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 27మృతుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జిల్లా కాంగ్రెస్‌నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి అందించారు. తెట్టెలపాడు, పిండిప్రోలు, దమ్మాయిగూడెం, బీరోలు, బచ్చుడు, కాకరవాయి తదితర గ్రామాల వారు ఈ సాయం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీ మంగిలాల్, నాయకులు గుగ్గిళ్ల అంబేద్కర్, ఉన్నం రాజశేఖర్, జి.శ్రీనివాసరెడ్డి, మందులరాజు, కందాల చంద్రారెడ్డి, మద్దిరాజిరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

భారీ వర్షాలతో నిలిచిన రాకపోకలు

» పాలేరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఇబ్బందిపడిన ప్రజలు



కూసుమంచి-కొత్తూరు మధ్య ప్రవహిస్తున్న వాగు

కూసుమంచి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా మండలంలో పలుగ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో ఈపరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నర్సింహులగూడెం-కొత్తూరు, నర్సింహులగూడెం-కిష్టాపురం, నర్సింహులగూడెం-పోచారం, జీళ్లచెరువు-చేగొమ్మ, జీళ్లచెరువు- తాళ్లచెరువు గ్రామాల మధ్యవాగులు పొంగిప్రవహిస్తున్నారు. పంచాయతీ అధికారులు గ్రామాల మధ్య రాకపోకలు నిలిపేశారు. జీళ్లచెరువులో కొండాలమ్మ చెరువు బ్యాక్‌వాటర్ పోటెత్తడంతో ఎస్సీకాలనీల్లో ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. అధికారులు కాల్వను తీసి నీటిని మళ్లించారు. జీళ్లచెరువులో వరిపొలాలు నీటమునిగాయి. పొలాలన్నీ చెరువులు తలపిస్తున్నాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, ఏడీఏ రమేష్, ఏవో వాణ నీటమునిగిన పొలాలను పరిశీలించారు.

అలుగులు పోస్తున్న చెరువులు

ఖమ్మంరూరల్: మండలంలోని చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు నార్లు పోసేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని తల్లంపాడు, పోస్నేకల్లు, కొండాపురం, ఆరెంపుల, పల్లెగూడెం తదితర గ్రామాల్లోని చెరువులు అలుగులు పోస్తున్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలు పత్తి, మిర్చి, తదితర పంటలకు ఊపిరిపోసినట్లు అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అలుగు పోస్తున్న తల్లంపాడు చెరువు



జీళ్లచెరువులో వరిపొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

డ్రెయిన్లు లేక ప్రజల ఇబ్బందులు

తల్లంపాడులో నేషనల్‌హైవే రహదారి ఏర్పాటు తరువాత వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ప్రధానంగా రహదారికి ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో వర్షపు నీరు నిలచిపోయింది. ప్రభుత్వపాఠశాల వద్ద బారీగా నీరునిలిచిపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నరసింహపురం వెళ్లే రహదారి వద్ద నీరు నిలిచిపోవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

మండలంలో భారీవర్షం

తిరుమలాయపాలెం: మండలంలో పలు గ్రామాల్లో చెరువులు, వాగులు, వంకలు పొంగాయి. ఆకేరు నది ఉధృతంగా ప్రవహిస్తుంది. బంధంపల్లి-బీరోలు,మేడిదపల్లి-సుబ్లేడు, బచ్చోడు-హస్నాబాద్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. వరద ఉధృతిని ఎస్ఐ జగదీష్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్ తహసీల్దార్ లూథర్ విల్సన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి పరిశీలించారు.

మహిళా హక్కులపై అవగాహన కల్పించాలి

» అతివల రక్షణకు చేరువగా సఖి వన్‌స్టాప్ సెంటర్లు

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం ఖానాపురంహవేలి,ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): సఖి కేంద్రాల ద్వారా మహిళల హక్కులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలోని సఖికేంద్రం, వన్‌స్టాప్ సెంటర్, షీటీమ్, భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. భరోసా, సఖికేంద్రాల్లోని న్యాయసలహా, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్‌మెంట్ రికార్డింగ్ గదులను, రిజిస్టర్ రికార్డులను పరిశీలించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించిన వారి వివరాలను, బాధితులకు అందించిన న్యాయ, వైద్య, వసతి ఇతర సదుపాయాలను తెలుసుకున్నారు. ఇప్పటివరకు 2338 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ కి వచ్చే బాధితులకు అన్ని రకాల సేవలు, సౌకర్యాలు సమకూర్చి న్యాయం అందించేలా చూడాలని కలెక్టర్ ఈసందర్భంగా నిర్వాహకులను ఆదేశించారు. అన్యాయానికి గురైనా మహిళలకు ఏసమస్య వచ్చినా నేరుగా 181 ఫోన్‌నెంబర్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్. అరుణ,కో-ఆర్డినేటర్ జి. రాజకుమారి, లీగల్ కౌన్సిలర్ ఇ.అంజని,టి. శ్రావణి, కె.సరిత, ఎం.సుమలత, ఎం.పుష్పలత, ఎన్. నవీన్ కుమార్ పాల్గొన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) సంతాపం



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ సైనిక దాడుల్లో మరణించిన జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఘన నివాళులు అర్పించారు. ఖమ్మం మయూరి సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద మంగళవారంరాత్రి టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సంఘం జిల్లాఅధ్యక్షకార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి మాట్లాడుతూ ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధకాండ వలన పాలస్తీనాలోని పసిపిల్లలు సైతం మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

వికాస్ విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్



జిల్లా కోర్టును సందర్శించిన విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వికాస్ పాఠశాల విద్యార్థులు సోమవారం నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. మార్కెట్, పోలీస్‌స్టేషన్, లైబ్రరీ, ఫైర్ స్టేషన్, జిల్లా కోర్టులను సందర్శించారు. విద్యార్థుల జ్ఞానాన్ని పెంచడమే కాకుండా పరిశీలన, ప్రశ్నించే అలవాటు, నేర్చుకోవటం తదితర అంశాలను నేర్పించాలనే లక్ష్యంతో పలు ప్రాంతాలను సందర్శించారని పాఠశాల కరస్పాండెంట్ లావణ్య తెలిపారు. విద్యార్థులు క్షేత్రస్థాయిలో మరిన్ని విషయాలు నేర్చుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

నేలకొండపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలో మంగళవారం బీజేపీ కార్యకర్తలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహన ర్యాలీ నేలకొండపల్లి పట్టణ ప్రధాన వీధుల గుండా సాగి పీఏస్సార్ సెంటర్‌కు చేరింది. అనంతరం ర్యాలీ నుద్దేశించి బీజేపీ రాష్ట్ర నాయకుడు నున్నా రవికుమార్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. హర్ ఘర్ తిరంగా అనేది మన త్రివర్ణ వైభవాన్ని ఇనుమడింప చేసే ప్రత్యేక పండుగగా మారిందన్నారు. మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ మండలంలోని మాజీసైనికులు, అమరవీరులు, మాతృభూమి సేవలో ప్రాణాలర్పించిన పోలీసుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను సన్మానించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావు, రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, నాయకులు దివాకర్, రాధాకృష్ణ, కల్యాణపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంపు కనెక్షన్‌ను ఆన్‌లైన్ చేసుకోవాలి

ఖమ్మంరూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లోని పంపుకనెక్షన్ ఉన్న యజమానులు వెంటనే ఆన్‌లైన్ చేసుకోవాలని ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ సైట్‌లో ఆన్‌లైన్ చేపించుకోవాలన్నారు. ప్రతీఒక్కరు ఇంటియమాని ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు, ఇంటిపన్ను కట్టిన రసీదు, ఫోన్ నంబర్లు తీసుకుని ఆ ఏరియాలోని పంపు ఆపరేటర్‌కు అందజేయాలని కమిషనర్ సూచించారు.

డీఎస్ఎస్ జిల్లా కన్వీనర్‌గా డేవిడ్

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ దళిత సంక్షేమసంఘం జిల్లా కన్వీనర్‌గా కొరకొప్పు డేవిడ్ నియమితులయ్యారు. ఆసంఘం కార్యాలయంలో మంగళవారం సంఘం రాష్ట్ర కన్వీనర్ నకిరికంటి సంజీవరావు నియామకపత్రం అందించారు.

ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

కూసుమంచి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన టీ.నివేష్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. మహాత్మ జ్యోతిబా పూలే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్‌ఎక్సలెన్సీ ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆర్.దినేష్‌సింగ్, జ్యోతేష్, లోహిత్ అనే విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ఏటీపీ వెంకటేశ్వర్లు అభినందించారు.



ఉపాధి పనులను పరిశీలించిన ఏపీడీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శిరీష, ఎంపీడీవో ఎర్రయ్య

నేలకొండపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం అడిషనల్ పీడీ శిరీష, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్యతో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మండలంలో మొత్తం 70 వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నట్లు చెప్పారు. చనిపోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటుతున్నట్లు చెప్పారు. రోడ్ల వెంట నాటిన మొక్కల్లో దాదాపు 15వేల మొక్కలు పోయాయని, వాటి స్థానంలో ఇప్పటికే 6,509 మొక్కల ప్లాంటేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన మొక్కలు నాటటానికి గుంతలు తీయటం దాదాపుగా పూర్తి అయ్యిందన్నారు. 20వతేదీ కల్లా ప్లాంటేషన్ పూర్తి చేస్తామన్నారు. అప్పలనర్సింహాపురంలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌కు ఫిట్టింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. 6వేల మొక్కలు నాటనున్నట్లు ఎంపీడీఓ ఎర్రయ్య చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ రావెళ్ళ సునీత, ప్లాంటేషన్ మేనేజర్ విజయలక్ష్మి, ఈసీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై సీపీఐ నిరసన

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 16 మరియు 19 డివిజన్‌ల సరిహద్దు రహదారిని ఎవ్వరూ పట్టించుకోవటం లేదని సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. రహదారిపై బురదనీటిలో జెండాలు పట్టుకొని మొక్కలు నాటుతూ వినూత్న నిరసన తెలిపారు. నగర సమితి కార్యదర్శి జానిమియా, కార్పొరేటర్ బీజే క్లైమెట్ నిరసనలో పాల్గొనటంతో అసిస్టెంట్ కమిషనర్ అనిల్ అక్కడకు వచ్చి వారితో మాట్లాడారు. అనంతరం కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందించారు.

వరదలపై ముందస్తు ఏర్పాట్లు

» కంట్రోల్‌రూమ్, టోల్‌ఫ్రీ నెంబర్ల ఏర్పాటు

» పరిశీలించిన ఏదులాపురం మునిసిపల్ కమిషనర్

ఖమ్మంరూరల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని మున్నేరు వరద బాధితుల కోసం అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. బాధితులకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ మంగళవారం తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్ 9515685414, తహసీల్దార్ కార్యాలయంలోని 8331930583 నంబర్లలో ఫిర్యాదులు చేయవచ్చన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవ సేవలందించేందుకు ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోందన్నారు. గజఈతగాళ్లను, తెప్పలను, టార్చ్‌లను, లైఫ్‌జాకెట్లను ఇప్పటికే సిద్ధం చేశామని చెప్పారు. మైకులు, ఆపదలో ఆదుకునేందుకు ప్రత్యేకవాహనాలను, ఎన్‌డీఆర్ఎఫ్ టీంలను అందుబాటులో ఉంచామని వివరించారు.ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని 12వార్డులను వరదముంపు ప్రాంతాలుగా గుర్తించి వాటికి సెక్టోరల్ ఆఫీసర్స్, వార్డ్ ఆఫీసర్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ తో టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6 పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా మీ అనుమానాలను ప్రభుత్వంవారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లోని నంబర్లకు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు.



లైఫ్ జాకెట్లను పరిశీలిస్తున్న కమిషనర్

శాంతినగర్ పాఠశాలలో మాక్ అసెంబ్లీ

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ప్రభుత్వ పాఠశాల శాంతినగర్‌లో సోమవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. శాసనసభ కార్యకలాపాలు, నిర్వాహణ తీరు, విద్యార్థులకు తెలిసేలా ప్రత్యక్షంగా విద్యార్థుచే మాక్‌అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థులను గవర్నర్‌గా, రాజ్యసభ ఛైర్మన్‌గా, ముఖ్యమంత్రిగా,స్పీకర్‌గా, మంత్రులుగా, ప్రతిపక్ష నేతలుగా పలు సమస్యలపై మాట్లాడించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులుకృపాబాలానందం, రవికుమార్, టి. సుబ్బారావు సాంఘిక శాస్త్ర ఫోరంకమిటీ సభ్యులు సుబ్బారావు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, సురేష్, ఉమాదేవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



మాక్‌అసెంబ్లీలో మాట్లాడుతున్న విద్యార్థిని

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల ప్రకారం ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రోగ్రాంలో భాగంగా ఎస్సార్‌బజీఎన్నార్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతి బాయి ప్రారంభించారు.హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువకులలో, ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నది ముఖ్యఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి వెంకటరమణ, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి జకీరుల్లా, కళాశాల ప్రిన్సిపల్ సునంద, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ చెంచురత్తయ్య, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ప్రోగ్రాంఆఫీసర్లు పిచ్చయ్య, జానీమియా, నాగేశ్వరరావు, కోటయ్య, ఎన్నెస్సెస్ జిల్లాఅధికారి ఎన్.శ్రీనివాసరావు, పోరుసెలవం, జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సిబ్బంది డి. సత్యకుమార్, నాగయ్య, మహమూద్‌అలీ, వీరయ్య, సిబ్బందిజాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

గిరిజన రైతులకు ఆర్థిక భారం

» కిరాయి ట్రాక్టర్లపై ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు

» ఖమ్మం రూరల్ డివిజన్‌లో పట్టించుకోని విద్యుత్ అధికారులు

» రైతులు ఫిర్యాదు చేసినా స్పందించని వైనం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారుల తీరుకారణంగా గిరిజన రైతులు ఆర్థికంగా, వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. నిబంధనల ప్రకారం మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్‌శాఖ వాహనంలో తరలించాలి.. కానీ ఇంధనశాఖ మంత్రి సొంత జిల్లాలోనే విద్యుత్‌శాఖ నిబంధనలు అమలు కావటం లేదు. వ్యవసాయ మోటర్లు మరమ్మతులకు గురైతే రైతులు ఫిర్యాదు చేసిన 24 గంటల లోపుగా స్థానికంగా ఉన్న విద్యుత్ సిబ్బంది విద్యుత్‌శాఖ వాహనంలో మరమత్తులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు పైసావ్యయం లేకుండా తరలించాలి. రవాణాతో సహా మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. కానీ ఖమ్మం రూరల్ డివిజన్‌లో మాత్రం అటువంటి పరిస్థితి కనిపించటం లేదు. ముఖ్యంగా గిరిజన తండాల నుంచి నెలలో పదిమంది వరకు రైతులు కిరాయి ట్రాక్టర్లను తీసుకొని వ్యయ ప్రయాసలకోర్చి ట్రాన్స్ ఫార్మర్లును ఖమ్మంలోని షెడ్‌లకు తరలిస్తున్నారు.



రైతులు ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

మూడు రోజులు నిరీక్షించి..

ఖమ్మంరూరల్ మండలం కస్నాతండాకు చెందిన గిరిజన రైతుల వ్యవసాయ భూమిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఈనెల10న మరమ్మతులకు గురైంది. వెంటనే స్థానికంగా ఉన్న విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు. అయినా సరిగా స్పందించక పోవటంతో రైతులు మంగళవారం కిరాయిట్రాక్టర్‌ను తీసుకొని ఖమ్మంలోని ట్రాన్స్‌ఫార్మర్ షెడ్‌కు తరలించారు. వ్యవసాయ సీజన్ కావటంతో చాలాఇబ్బంది పడ్డామని, మూడు రోజులు ఉండి ఇబ్బంది కావటంతో సొంతంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరలించామన్నారు.

రైతులు 1912కు ఫిర్యాదు చేయాలి

ఇంగూరి శ్రీనిసాచారి, ఎస్ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్



వినియోగదారులు, రైతులు.. విద్యుత్ సమస్యలపై 1912కు ఫిర్యాదుచేస్తే వెంటనే నిబంధనల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులోకి వస్తారు. రైతుల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పుకు కేవలం 24గంటల సమయం సరిపోతుంది. అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఎట్టి పరిస్థితిలో కిరాయి ట్రాక్టర్లు వినియోగించాల్సిన అవసరం లేదు. విద్యుత్‌శాఖ వాహనాలే ఉచితంగా రవాణా చేస్తాయి. కస్నాతండాలో మూడు రోజులు పాటు రైతులు ఇబ్బంది పడటంపై విచారణ జరుపుతాం.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): భూభారతి పోర్టల్ ద్వారా ఈ ఏడాది జూన్ 5వ తేదీలోపు నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 13లోగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 1966ఆగస్టు 14నుంచి 2007 ఆగస్టు 14వ తేదీ మధ్యలో జన్మించిన 18-59 ఏళ్లలోపు వారికే ఈ అవకాశం ఉందని, మండలంలో 452మంది ఉండగా, మొత్తంగా 753 మంది రైతులు దరఖాస్తు అందజేయాల్సి ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుండపోత వర్షం

- నీటమునిగిన పొలాలు
- నిలిచిన రాకపోకలు

ముదిగొండ/బోనకల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో సోమవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పంటపొలాలు నీటమునగగా వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. ముదిగొండ మండలం మేడేపల్లి వాగు పొంగి పొర్లడంతో పత్తి, వరి పొలాలన్నీ నీటమునిగాయి.

చింతకాని: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. లచ్చగూడెం, నేరడ, బస్వాపురం, నాగులవంచ చెరువులు అలుగులు పోస్తున్నాయి. నాగులవంచ నుంచి పాతర్లపాడు గ్రామం వెళ్లే రహదారిపై బండిరేవు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు వెళ్లకుండా పోలీసులు పంచాయతీ ట్రాక్టరు ను అడ్డుగా ఉంచారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి సూచించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బోనకల్: వర్షాల వలన పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో వర్షాల వలన నీళ్లు నిలిచిన పంటలను మంగళవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పత్తి పంటలను సాగు చేయగా కాపుదశలో ఉండగా పడిన వర్షం నట్టేట ముంచిందన్నారు. నీళ్ల నిలవడం వలన పత్తి పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని కోరారు.



మేడేపల్లిలో నీటమునిగిన పత్తి పైరు



నాగులవంచ వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరద



బోనకల్‌లో నీళ్లు నిలిచిన పత్తిపంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు



ముదిగొండ మండలంలో వరి పొలాలపైనుంచి ప్రవహిస్తున్న వాగు

డాక్టర్ ఖాసీంను ఆదర్శంగా తీసుకోవాలి

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): నేటి యువత డాక్టర్ ఖాసీంను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం డాక్టర్ షేక్ ఖాసీం స్థాపించిన ఆసుపత్రిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ డాక్టర్ ఖాసీం తల్లి కాకర్లపల్లిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్మికురాలిగా, తండ్రి గ్రామ పంచాయతీ వాటర్ సప్లయ్ సెక్షన్‌లో పనిచేశారని అన్నారు. ఉన్నత స్థాయికి ఎదగడానికి సంకల్పం, కృషి ఉండాలన్నారు. దీనికి డాక్టర్ ఖాసీం నిదర్శనమంటూ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

23న జరిగే ధర్నాను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

వైరా, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 23న ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల సాధన కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎస్‌పీసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం వైరా మండల పర్యటనలో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని, విద్యారంగానికి బడ్జెట్లో 20శాతం నిధులు కేటాయించాలని కోరుతూ 23న ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. నాయకులు ఆకుల నాగేశ్వరరావు, కృష్ణ, బ్రహ్మం, విజయ్‌కుమార్, నర్సింహారావు పాల్గొన్నారు.

రోగులను పట్టించుకోని వైద్యులు: బీజేపీ



ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన బీజేపీ నాయకులు

మధిర, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఉదయం ఉద్యోగానికి వచ్చి సంతకాలు పెట్టి తమ ప్రైవేటు ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలను పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం ఉదయం తాము ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనకు వస్తే ఒకరిద్దరు మినహా మిగిలిన వారు ఎవరూ అందుబాటులో లేరని పేర్కొన్నారు. వైద్యుల కోసం ఆరా తీస్తే వారంతా వారి వారి ప్రైవేటు క్లీనుకుల్లో పని చేస్తున్నారని తెలిసిందని అన్నారు. ప్రభుత్వ డాక్టర్లు తమ సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, పేదలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ అధ్యక్షుడు శివరాజు సుమంత్, గడ్డం శ్రీహరి, రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, పాపట్ల రమేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కారేపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్ యూ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్, పీడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో వారు పాల్గొని మాట్లాడారు. . ఈకార్యక్రమంలో అజయ్, సంజయ్, లోకేష్, చందు, వేణు, ఉషశ్రీ, సంధ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ఏఐఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

మధిర రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్‌ఎఫ్‌ఐ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ఏఐఎస్‌ఎఫ్ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి మాతృభూమి విముక్తి కోసం 1936 ఆగస్టు 12న ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించి దేశ స్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించిదని తెలిపారు. కార్యక్రమంలో క్రాంతి, నరేంద్ర, సాయిమణికంఠ, రాజు, వంశీ, అభిషేక్ పాల్గొన్నారు.

రవాణా సేవలను కొనసాగించాలి

చింతకాని, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రవాణా సేవలు నిలిపివేస్తున్నట్లు రైల్వేశాఖ సర్క్యూలర్ జారీచేయడంతో మంగళవారం పాతర్లపాడు, రైల్వేకాలనీ గ్రామస్థులు రైల్వే ఫ్లాట్‌ఫామ్‌పై నిలబడి నిరసన తెలిపారు. రైల్వేశాఖ ఇచ్చిన జీవో వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీను, కరణం తిరుమలరావు, ప్రసాద్, యలమంద, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

‘స్థానిక సమరం’లో విజయం సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నందిని

ఎర్రుపాలెం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మీకోసం మేం ఉన్నాం..కాంగ్రెస్ పార్టీ కోసం మీరునిలబడండి అంటూ అమ్మ ఫౌండేషన్ చైర్మన్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లునందిని అన్నారు. మంగళవారం మండలంలోని జమలాపురం గ్రామంలోగల బాలాజీభవన్‌లో మండల కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జులు, కాంగ్రెస్ ముఖ్యనాయకులతో స్థానిక సంస్థల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మీనవోలు గ్రామంలో వరినాట్లు వేస్తున్న కూలీలను పలకరించి వారితో కలిసి వరినాట్లు నాటారు. బంజర గ్రామంలో ఇటీవల కట్టలేరు నదిలో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలను పరామర్శించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్, పార్టీనాయకులు చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, మూల్పూరి శ్రీనివాసరావు, నన్నపనేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ

మధిర: అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని మంగళవారం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో స్నానాల లక్ష్మీపురానికి చెందిన తాళ్లూరి లక్ష్మీశరణ్యకు ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిది వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, విజయ్, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈవో

ఏన్కూరు, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్‌విద్యాశాఖ అధికారి కె.రవిబాబు సందర్శించారు. కళాశాలలో రూ.18 లక్షలతో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఆదేశించారు. అనంతరం అధ్యాపకుల డైరీలు, హాజరు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను నీట్, ఎప్‌సెట్ పరీక్షలకు సిద్ధం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు సుందర్,కృష్ణప్రసాద్, రమాదేవి, కిషోర్, రామారావు, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, నరసింహారావు, రాజన్న, సాంబశివరావు, నవీన్, బ్రహ్మం, లావణ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న రవిబాబు

ప్రతీ మొక్కను సంరక్షించాలి

» జిల్లా అదనపు పీడీ శిరీష



మొక్క నాటుతున్న అదనపు పీడీ శిరీష

ముదిగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని జిల్లా అదనపు పీడీ శిరీష సూచించారు. మంగళవారం ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శనేత సీతారాం ఏచూరి



సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కారేపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి, కార్మిక, కర్షకుల సిద్ధాంతం కోసం ఆలోచించే ఉద్యకారుడు సీతారాం ఏచూరి అని మండల సీపీఎం కమిటీ కార్యదర్శి కె.నరేందర్ అన్నారు. మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి73వ జయంతి కార్యక్రమాన్ని పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారవు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నరేందర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి సీపీఎం పార్టీ దేశవ్యాప్తింగా విస్తరింపజేసిన మహానేతగా అభివర్ణించారు.స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్నా, మోహన్‌రావు,కుమార్,కృష్ణ,రాయమల్లు తదితరులున్నారు.

ముష్టికుంట్ల ఊర చెరువు బుంగకు మరమ్మతు పనులు

బోనకల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామ ఊర చెరువుకు అకాల వర్షానికి బుంగ పడటంతో మంగళవారం ఇరిగేషన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమాదేవిలు మరమ్మతు పనులను చేయించారు. తూముల వద్ద పైపులైన్ పగలడంతో కొత్త పైపులైన్‌ను వేయించారు. ఊర చెరువుకు గండి పడటంతో వరద నీళ్లు బారీగా కిందకు పోతున్నాయి. అధికారులు మరమ్మతు పనులు చేయించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఎం నాయకుడు సత్యనారాయణకు నివాళి

మధిర, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కూరపాటి సత్యనారాయణ(84) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సత్యనారాయణ మృతదేహాన్ని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, కల్లూరు మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, చిత్తారు నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాతా భాస్కర్‌రావు, మడుపల్లి గోపాలరావు సందర్శించి నివాళులర్పించారు.



సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కమల్‌రాజు

పుస్తకాల పంపిణీ

కల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల కాంగ్రెస్ నాయకుడు, దాత తక్కెళ్లపాటి దుర్గాపసాద్ చేతుల మంగళవారం నోట్సులు, పెన్నులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని రఘునాథగూడెం, రఘునాధబంజర, ఎర్రబంజర, కొర్లగూడెం, వాచ్యానాయక్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 150 మందికి పైగా పేద విద్యార్థులకు తమ వంతుగా దుర్గాప్రసాద్ నోట్సులు, పెన్నులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామకృష్ణారెడ్డి, ముకర విజయరావు, పంతులునాయక్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దుర్గాప్రసాద్

మహనీయుల ఆశయాల కోసం శ్రమిద్దాం

» నందమూరి తారకరామారావు తనయుడు రామకృష్ణ



గంగారంలో మాట్లాడుతున్న నందమూరి రామకృష్ణ

సత్తుపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత ఎన్టీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నేటికి కొనసాగుతున్నాయని, అలాంటి మహనీయుల ఆశయాల సాధనకోసం శ్రమిద్దామని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గంగారంలో టీడీ పీ జెండాను ఆవిష్కరించారు. ఈ ప్రాంతానికి రావడం తనకు చాలా సంతోషంగా ఉందని, అదేవిధంగా పార్టీ గౌరవాన్ని పెంచేలా ప్రతి కార్యకర్త నడుచుకోవాలని, క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు వెళ్తుండగా మార్గమధ్యలోని గంగారంలో జెండావిష్కరించిన అనంతరం మోటారు సైకిల్ ర్యాలీతో నాచారం వెళ్లారు.

మునిసిపాలిటీ కార్మికుల కార్యవర్గం ఎన్నిక

కల్లూరు, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీ నూతన కార్మిక సంఘం (ఏఐటీయూసీ) కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా వేము రాంబాబు, అధ్యక్షుడిగా ఊడల కృష్ణ, ఉపాధ్యక్షులుగా గొల్లమందల యశోద, ఎస్‌డీ వజీర్‌మియా, ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి శ్రీను, కోశాధికారిగా కంభంపాటి ప్రకాష్, సభ్యులుగా సుధాకర్, ప్రవీణ్, అంజలి, మరియమ్మ, రాంబాబు మరో 9మందితో పాటుగా సలహాదారునిగా దామాల దయాకర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు కార్మికులు అభినందించారు.



ఎన్నికైన కార్మికుల కార్యవర్గం